RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:84 | మార్చి 12, 2026 | వెల: రూ.3-00

## అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

- రెండు నెలలుగా పని లేక తీవ్ర మనస్తాపం
- ఈఎంఐలు చెల్లించలేక బలవన్మరణం
- యాదాద్రి భువనగిరి జిల్లాలో విషాదం



2లో



## జనగామలో ఝా మార్క్!

### అధికారులకు వణుకు పుట్టిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్

- నిర్లక్ష్యం వహిస్తే ఎవరైనా వేటు పడాల్సిందే
- ఆకస్మిక తనిఖీలతో హడలెత్తిస్తున్న వైనం
- విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి
- ప్రజల్లో వెల్లువెత్తుతున్న ప్రశంసలు

2లో






# ఎనీటైమ్ లిక్కర్!

## పల్లెల్లో అడుగడుగునా బెల్ట్ షాపుల జోరు

### మత్తులో జోగుతున్న గ్రామాలు

- తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు అందుబాటులో మద్యం
- క్వార్టర్ కు రూ.20 నుంచి రూ.40 అదనపు వసూళ్లు
- చితికిపోతున్న పేద కుటుంబాలు..
- తాగుడుకు బానిసవుతున్న యువత
- 'బెల్ట్'ను ప్రోత్సహిస్తున్న వైన్స్ యాజమాన్యాలు
- ఆటోల్లో మద్యం సరఫరా
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు
- నామమాత్రపు తనిఖీలతోనే సరి



2లో

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

పచ్చని పల్లెలు నేడు మద్యం మత్తులో తూగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ.. గ్రామాల్లో అడుగుపెట్టిన బెల్ట్ షాపు సంస్కృతి సామాన్యుల జీవితాలను ఛిద్రం చేస్తోంది. కిరాణా కొట్టు నుంచి పాన్ డబ్బా వరకు.. గల్లీ గల్లీలో మద్యం ఏరులై పారుతోంది. ఎక్సైజ్ అధికారుల కళ్లు గప్పేలా.. ద్విచక్ర వాహనాల ద్వారా మారుమూల గ్రామాలకు సైతం అక్రమ మద్యం రవాణా సాగుతోంది. ఎమ్మార్పీ కంటే అధిక ధరలతో సామాన్యుడి జేబుకు చిల్లులు పడుతుంటే.. ఆ మత్తులో కొట్టుమిట్టాడుతున్న పేద కుటుంబాలు చితికిపోతున్నాయి. పల్లెలను బెల్ట్ షాపులను పట్టి పీడుస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు కొట్టివేత

### 10 మందికి స్పీకర్ క్లీన్ చిట్

- దానం నాగేందర్, కడియం శ్రీహరిపై ఆరోపణలకు ఆధారాలు లేవు
- పార్టీ మారినట్లు నిరూపణ కాలేదని వ్యాఖ్య
- సుప్రీంకోర్టు విచారణకు ముందే స్పీకర్ నిర్ణయం

2లో



## స్పీకర్ తీర్పు అప్రజాస్వామికం

- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇవ్వడం ఏంటి?
- కాంగ్రెస్ వైఖరిపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి
- తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు

2లో





## తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- సీఎం రేవంత్ రెడ్డి సహా ప్రముఖుల హాజరు
- లోక్‌భవన్‌లో ఘనంగా కార్యక్రమం

2లో

## వెలుగుమట్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ

- 101 మందికి సొంత ఊర్లలో ఇందిరమ్మ ఇండ్లు
- డిసెంబర్ 9న సామూహిక గృహప్రవేశానికి సన్నాహాలు
- పేదలకు ఇళ్లు కల్పించడం ప్రభుత్వ లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల

2లో



## కవిత దీక్ష విరమణ

వెలుగుమట్ల బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్య



2లో

వేద న్యూస్

గురువారం | మార్చి 12, 2026

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు కొట్టివేత

## 10 మందికి స్పీకర్ క్లీన్ చిట్

- దానం నాగేందర్, కడియం శ్రీహరిపై ఆరోపణలకు ఆధారాలు లేవు
- పార్టీ మారినట్లు నిరూపణ కాలేదని వ్యాఖ్య
- సుప్రీంకోర్టు విచారణకు ముందే స్పీకర్ నిర్ణయం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్న ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల వ్యవహారానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముగింపు పలికారు. అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిపై దాఖలైన అనర్హత పిటిషన్లను ఆయన కొట్టివేస్తూ వారికి క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిద్దరూ అధికారికంగా పార్టీ మారినట్లు సరైన ఆధారాలు లేవని స్పీకర్ తన తీర్పులో పేర్కొన్నారు. ఈ అంశంపై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉండగా, కోర్టు విచారణకు ముందు రోజు స్పీకర్ తన విచారణను ముగించి తీర్పు వెలువరించారు. దానం నాగేందర్, కడియం శ్రీహరితో పాటు పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు కూడా స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం గమనార్హంగా మారింది. ఫిర్యాదుదారులు సమర్పించిన ఆధారాలు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించడానికి సరిపోవని స్పీకర్ తన నిర్ణయంలో స్పష్టం చేశారు. పార్టీ మారినట్లు నిరూపించే తగిన సాక్ష్యాలు లేకపోవడంతో అనర్హత వేటు విధించలేమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. స్పీకర్ తీర్పుపై ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి నాయకులు ఎలా స్పందిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ఈ వ్యవహారం సుప్రీంకోర్టు దృష్టికి వెళ్లిన నేపథ్యంలో తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయన్నదానిపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## స్పీకర్ తీర్పు అప్రజాస్వామికం

- పార్టీ మారిన ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇవ్వడం ఏంటి?
- కాంగ్రెస్ వైఖరిపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి
- తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో శాసనసభ స్పీకర్ వెలువరించిన తీర్పు ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నల్లా రామచందర్ రావు విమర్శించారు. నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి కొద్ది కాలంలోనే పార్టీ మారి కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనని అన్నారు. ఇంత స్పష్టమైన పరిస్థితులు ఉన్నప్పటికీ అది పార్టీ ఫిరాయింపు కాదని స్పీకర్ తీర్పు ఇవ్వడం ఆశ్చర్యకరమని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రజల తీర్పును, ప్రజాస్వామ్య విలువలను అవమానించడం వంటిదేనని వ్యాఖ్యానించారు. ప్రజల ముందే జరిగిన ఘటనను కూడా ఫిరాయింపుగా పరిగణించకపోవడం విచారకరమని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకత్వాన్ని కూడా ఆయన ప్రశ్నించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగంగా ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడతామని చెప్పే కాంగ్రెస్ పార్టీ ఈ పరిస్థితిని ఎలా సమర్థిస్తుందో స్పష్టం చేయాలని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. స్పీకర్ తీర్పు రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి తీరని అవమానమని నల్లా రామచందర్ రావు పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- సీఎం రేవంత్ రెడ్డి సహా ప్రముఖుల హాజరు
- లోక్‌భవన్‌లో ఘనంగా కార్యక్రమం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో నిర్వహించిన ఘన కార్యక్రమంలో ఆయన గవర్నర్ పదవిని స్వీకరించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి శివ ప్రతాప్ శుక్లాను ఆహ్వానిస్తూ స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రజల తరఫున కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కలిసి పనిచేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. వీరితో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. లోక్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. కొత్త గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివ ప్రతాప్ శుక్లా రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తారని రాష్ట్ర నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎనీటైమ్ లిక్కర్!

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**




పల్లెల్లో ప్రశాంతత కరువవుతోంది. ఒకప్పుడు పచ్చని పొలాలు, ఆప్యాయతలకు నిలయమైన గ్రామాలు నేడు మద్యం మత్తులో తూగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం మాఫియా తన రూటు మార్చి, పల్లెల్లో 'ఎనీటైమ్ లిక్కర్' సంస్కృతిని తీసుకువచ్చింది. అడుగడుగునా వెలుస్తున్న బెల్ట్ షాపులు సామాన్యుల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో మద్యం విక్రయదారులు బరితెగించి వ్యవహరిస్తున్నారు.

### అడుగడుగునా బెల్ట్ షాపుల జోరు!

గ్రామాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు లేకపోయినా, ప్రతి గల్లీలోనూ బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయి. కిరాణా కొట్టు నుంచి పాన్ డబ్బా వరకు మద్యం సీసాలు అందుబాటులో ఉంటున్నాయి. ఉదయం ఐదు గంటల నుంచే ఈ విక్రయాలు ప్రారంభమై, అర్ధరాత్రి వరకు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. మద్యం మాఫియా తన నెట్‌వర్క్‌ను ఎంతలా విస్తరించిందంటే, మద్యం కావాలనుకున్న వారు మైళ్ల దూరం వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఇంటి పక్కనే దొరికేలా ఏర్పాట్లు చేసింది. దీనివల్ల పల్లెల్లో తాగుబోతుల సంఖ్య పెరగడమే కాకుండా, చిన్నపాటి గొడవలు కాస్తా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి.

### ద్విచక్ర వాహనాల ద్వారా మద్యం తరలింపు!

ఎక్సైజ్ అధికారుల కళ్లు గప్పేందుకు మద్యం మాఫియా కొత్త ఎత్తుగడలు వేస్తోంది. వైన్ షాప్స్ నుంచి గ్రామాల్లోని బెల్ట్ షాపులకు మద్యం తరలించేందుకు ద్విచక్ర వాహనాలను వాడుతున్నారు. పాలు, కూరగాయల సంచుల మాదిరిగా మద్యం సీసాలను సంచుల్లో నింపి, ఎవరికీ అనుమానం రాకుండా పల్లెల్లోని అడ్డాలకు చేరుస్తున్నారు. ఒక్కో ద్విచక్ర వాహనం రోజుకు పదుల సంఖ్యలో ట్రిప్పులు వేస్తూ మద్యం సరఫరా చేస్తోంది. ప్రధాన రహదారులపై కాకుండా మారుమూల దారుల గుండా ఈ అక్రమ రవాణా సాగుతుండటంతో వీరిని పట్టుకోవడం కష్టతరంగా మారుతోంది.

### ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయం

బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు కేవలం చట్ట విరుద్ధం మాత్రమే కాదు, అక్కడ జరుగుతున్న దోపిడీ కూడా అంతా ఇంతా కాదు. ప్రతి మద్యం సీసాపై ఎమ్మార్పీ కంటే క్వార్ట్ కు రూ.20 ఫుల్ బాటిల్ కు రూ.80 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అత్యవసరంగా మద్యం కావాలనుకునే వారు, దూరం వెళ్లలేక ఈ అదనపు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇలా ఒక్కో బెల్ట్ షాపు యజమాని నెలకు వేల రూపాయల అక్రమ లాభాలను ఆర్జిస్తుండగా, ఆ భారం పేదవాడి జేబుపై పడుతోంది. ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయం కాస్తా మధ్యవర్తులు, మద్యం సిండికేట్ల జేబుల్లోకి వెళ్తోంది.

### చితికిపోతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు!

ఈ మద్యం మహమ్మారి వల్ల అత్యధికంగా నష్టపోతోంది పేద, మధ్య తరగతి కుటుంబాలే. రెక్కాడితే గాని డొక్కాడని కూలీలు, తాము కష్టపడి సంపాదించిన డబ్బునంతా సాయంత్రం అయ్యేసరికి బెల్ట్ షాపుల్లో పోస్తున్నారు. దీనివల్ల ఇళ్లలో నిత్యం గొడవలు, మహిళలపై వేధింపులు పెరిగిపోతున్నాయి. తండ్రుల తాగుడు అలవాటు వల్ల పిల్లల చదువులు ఆగిపోతున్నాయి. పల్లెల్లో ఆరోగ్య సమస్యలు కూడా పెచ్చుమీరుతున్నాయి. ఊరు ఊరంతా మద్యం మత్తులో మునిగిపోతుండటంతో సామాజిక విలువలూ పతనమవుతున్నాయి.

### పల్లెల్లో అడుగడుగునా బెల్ట్ షాపుల జోరు

- మత్తులో జోగుతున్న గ్రామాలు
- తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు అందుబాటులో మద్యం
- క్వార్టర్ కు రూ.20 నుంచి రూ.40 అదనపు వసూళ్లు
- చితికిపోతున్న పేద కుటుంబాలు..
- తాగుడుకు బానిసవుతున్న యువత
- 'బెల్ట్'ను ప్రోత్సహిస్తున్న వైన్స్ యాజమాన్యాలు
- ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో మద్యం సరఫరా
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు
- నామమాత్రపు తనిఖీలతోనే సరి

### నిద్రావస్థలో ఎక్సైజ్ శాఖ అధికారులు!

ఇంత దారుణంగా మద్యం విక్రయాలు సాగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం నిద్రావస్థలో ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. అప్పుడప్పుడు నామమాత్రపు దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, బెల్ట్ షాపుల మూలాలను కదిలించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాల యజమానుల నుంచి అధికారులకు నెలవారీ మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పల్లెల్లో బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేసి, అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

# జనగామలో 'ఝా' మార్క్!





**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

- అధికారులకు వణుకు పుట్టిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్
- నిర్లక్ష్యం వహిస్తే ఎవరైనా వేటు పడాల్సిందే
- ఆకస్మిక తనిఖీలతో హడలెత్తిస్తున్న వైనం
- విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి
- ప్రజల్లో వెల్లువెత్తుతున్న ప్రశంసలు

జిల్లా పరిపాలనలో కొత్త ఒరవడిని సృష్టిస్తూ, విధుల్లో అలసత్వాన్ని ఏమాత్రం సహించని ఐఏఎస్ అధికారిగా జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వార్తల్లో నిలుస్తున్నారు. ప్రభుత్వ సేవలు సామాన్యుడికి సకాలంలో అందాలన్న లక్ష్యంతో ఆయన తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు ప్రస్తుతం జిల్లా యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణే పరమావధిగా సాగుతున్న ఆయన పాలనా తీరుతో విధులకు ఎగనామం పెట్టే అధికారుల గుండెల్లో వణుకు మొదలైంది.

### ఆకస్మిక తనిఖీలతో అప్రమత్తం

కలెక్టర్ ఏ సమయంలో ఎక్కడికి వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాలు, మండల ఆఫీసులు, ప్రభుత్వ ఆసుపత్రులను ఆయన ఆకస్మికంగా సందర్శిస్తున్నారు. సమయపాలన పాటించని వారిపై, ఫైళ్లను అనవసరంగా పెండింగ్‌లో పెట్టే అధికారులపై ఆయన తీవ్రంగా స్పందిస్తున్నారు. ప్రభుత్వ ఆఫీసులకు వచ్చే ప్రజలను గంటల తరబడి వేచి చూడనివ్వడం నేరం అని స్పష్టం చేస్తూ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే సిబ్బందిపై అవసరమైతే సస్పెన్షన్ వేటు వేసేందుకు కూడా వెనుకాడబోనని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

### విద్య, వైద్య రంగాలు.. నాణ్యతే ప్రధానం

కేవలం ఆఫీసులకే పరిమితం కాకుండా, సామాన్యుడికి అత్యంత అవసరమైన విద్య మరియు వైద్య రంగాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా నాణ్యతను స్వయంగా పర్యవేక్షిస్తూ, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలిస్తున్నారు. అదేవిధంగా, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందేలా, డాక్టర్లు మరియు సిబ్బంది అందుబాటులో ఉండేలా కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

### ప్రజల్లో హర్షం

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కఠిన వైఖరి వల్ల జిల్లాలో పాలనా వ్యవస్థ గాడిలో పడుతోందని సామాన్య ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల్లో జవాబుదారీతనం పెరిగిందని, గతంలో పెండింగ్‌లో ఉన్న పనులు ఇప్పుడు వేగవంతంగా పూర్తవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పరిపాలనను పారదర్శకంగా మార్చి, ప్రభుత్వ పథకాలను అర్హులకు సకాలంలో అందేలా ఆయన చేస్తున్న కృషి జిల్లాలో సానుకూల మార్పులకు శ్రీకారం చుడుతోంది.

# వెలుగుమట్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ

- 101 మందికి సొంత ఊర్లలో ఇందిరమ్మ ఇండ్లు
- డిసెంబర్ 9న సామూహిక గృహప్రవేశానికి సన్నాహాలు
- పేదలకు ఇళ్లు కల్పించడం ప్రభుత్వ లక్ష్యం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి**

వెలుగుమట్ల భూదాన్ భూముల నిర్వాసితుల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. హౌసింగ్ శాఖ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా లబ్ధిదారులు సామూహిక గృహప్రవేశం జరుపుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇంటి స్థలం లేని 311 మందికి పట్టాలు, సొంత ఊర్లలో స్థలం ఉన్న 101 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. మౌలిక వసతులైన రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి పనులను త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భూదాన్ భూములపై జరిగిన అక్రమాలను అరికట్టి అర్హులైన పేదలకు పట్టాలు అందిస్తున్నామని తెలిపారు. భూముల పేరుతో ప్రజలను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

**వేద న్యూస్, యాదాద్రి భువనగిరి**

రెండు నెలలుగా పని లేకపోవడం, అప్పుల భారంతో మరో చేనేత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకుంది. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన మిర్యాల బాలరాజు (39) ఈ దారుణ నిర్ణయం తీసుకున్నాడు. కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం బాలరాజు ఐదేళ్ల క్రితం చేనేత పనుల కోసం భువనగిరిలోని ఓ ప్రైవేటు సంస్థ నుంచి రూ.3.50 లక్షలు రుణంగా తీసుకున్నాడు. ఈ రుణానికి సంబంధించి ప్రతి నెల ఈఎంఐలను చెల్లిస్తూ వస్తున్నాడు. అయితే గత రెండు నెలలుగా చేనేత పనులు లేకపోవడంతో ఆదాయం లేకపోయింది. దీంతో ఈఎంఐలను చెల్లించలేక తీవ్ర ఆందోళనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పుల ఒత్తిడి, పని లేకపోవడం వల్ల తీవ్ర మనస్తాపానికి గురైన బాలరాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# కవిత దీక్ష విరమణ

**వెలుగుమట్ల బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్య**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేపట్టిన నిరవధిక దీక్షను విరమించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య నిమ్మరసం ఇచ్చి కవితతో పాటు ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్‌కు దీక్షను విరమింపజేశారు. వెలుగుమట్ల భూదాన్ భూమి సమస్యపై ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో వెలుగుమట్లలో అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. మొత్తం 412 మందిని గుర్తించి పట్టాలు అందజేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వెలుగుమట్ల పేదలకు న్యాయం చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో దీక్షను విరమించినట్లు కవిత పేర్కొన్నారు. పట్టాలు పొందిన వారు త్వరలోనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. దీక్ష విరమణ సందర్భంగా కవిత మాట్లాడుతూ తమ పోరాటం పూర్తిగా ముగియలేదని, కేవలం విరామం మాత్రమే అని అన్నారు. వెలుగుమట్ల బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆందోళనలు, మహిళల నిరసనల కారణంగానే ప్రభుత్వం స్పందించిందని కవిత పేర్కొన్నారు.

వేద న్యూస్

గురువారం మార్చి 12, 2026

# సెస్ ఆఫీస్ ఎదుట ఉద్యోగుల ధర్నా

**- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కో-ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లై సొసైటీ (సెస్) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ పెండింగ్ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిరిసిల్ల పట్టణంలోని సెస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కర్నాల అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులతో పాటు జిల్లాలోని 15 మండలాలకు చెందిన ప్రతినిధులు, అసిస్టెంట్ హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలుమార్లు వినతిపత్రాలు, మెమోరాండంలు సమర్పించినప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని, కారుణ్య నియామకాలను రెగ్యులరైజ్ చేయాలని, సేవా సంవత్సరాల ఆధారంగా మానిటరీ బెనిఫిట్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత ఏడు నెలలుగా నిలిపివేసిన ఎఫ్‌టిఏ చెల్లింపులను పునరుద్ధరించాలని, వర్క్ నార్మ్స్ ప్రకారం కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. ఉద్యోగుల భద్రత కోసం రక్షణ పరికరాలు అందించడంతో పాటు టీజీఎన్‌పీడీసీఎల్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, అసిస్టెంట్ హెల్పర్స్ పేరును జూనియర్ లైన్‌మెన్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. సెస్ యాజమాన్యం వెంటనే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు.

# ఏడాదిలోపు డంపింగ్ యార్డ్ తరలిస్తాం

**- ప్రజల ఆరోగ్యమే ముఖ్యం**
**- మంత్రి పొన్నం ప్రభాకర్**
**- డంపింగ్ యార్డ్ పరిశీలన**

**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ పట్టణంలోని డంపింగ్ యార్డును రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. డంపింగ్ యార్డు కారణంగా పట్టణ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఈ సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొంటూ, చొప్పదండి సభలో డంపింగ్ యార్డును తరలిస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డు తరలింపు ప్రక్రియను వేగవంతం చేస్తామని చెప్పారు. దాదాపు 40 సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్తను ఒక్కరోజులో తరలించడం సాధ్యం కాదని, అయితే ఏడాదిలోపు పూర్తిస్థాయిలో తరలించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ నుండి తరలించే డంపింగ్ యార్డును వరంగల్-కరీంనగర్ మధ్య ప్రాంతంలో ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రోజువారీగా వచ్చే చెత్తతో పాటు ఇప్పటికే పేరుకుపోయిన వ్యర్థాలను ఎలా తరలించాలన్న దానిపై ప్రత్యేక విధానం రూపొందించనున్నట్లు మంత్రి తెలిపారు. చెత్త తరలింపులో ఒక స్వచ్ఛంద సంస్థ కూడా సహకరించేందుకు ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, పలువురు కార్పొరేటర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# నీటి కోసం రోడ్డెక్కిన కాలనీవాసులు

**- ఆరు రోజులుగా తాగునీటి సరఫరా బంద్**



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ నగరంలోని చింతకుంట పరిధి 15వ డివిజన్ టీఆర్‌కే నగర్ కాలనీలో గత ఆరు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు అందక రోజువారీ అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి నెలకొంది. స్థానికుల వివరాల ప్రకారం బీఎస్‌ఎన్‌ఎల్ చేపడుతున్న అండర్‌గ్రౌండ్ పైపింగ్ పనుల సమయంలో నీటి పైపులు పలు చోట్ల దెబ్బతిని పగిలిపోవడంతో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో కాలనీలో నీటి సమస్య మరింత తీవ్రమైంది. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకునే స్తోమత లేక నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. నగరపాలక సంస్థ అధికారులు, పైపింగ్ పనులు నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు తక్షణమే స్పందించి పగిలిన పైపులను మరమ్మతు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సమ్మయ్య, నారాయణ, లక్ష్మీనారాయణ, శ్రీధర్ బాబు, ఆర్. అనిల్ కుమార్, బి. సంపత్, కె. విజయ్, సిహెచ్. శేఖర్, డి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వీడ్కోలు సంబరాలు

**వేద న్యూస్, కారేపల్లి:**



విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన పదో తరగతి ఘట్టాన్ని ముగించుకుని ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేస్తున్న విద్యార్థులకు కారేపల్లిలోని నిర్మల హైస్కూల్ బుధవారం ఘనంగా వీడ్కోలు పలికింది. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన 'ఫేర్‌వెల్-2026' వేడుకలు అత్యంత ఆనందోత్సాహాల మధ్య, భావోద్వేగభరిత వాతావరణంలో జరిగాయి.

**సాంస్కృతిక కేళీ.. విద్యార్థుల సందడి**

ఈ వేడుకకు విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం సాదరంగా ఆహ్వానించింది. విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. ప్రాంగణమంతా విద్యార్థుల కేరింతలతో, చిన్నారుల సందడితో కళకళలాడింది.

**ఉన్నత లక్ష్యాలే విజయానికి పునాది: హెచ్‌ఎం పిన్నిలా**

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పిన్నిలా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. "క్రమశిక్షణ, పట్టుదల ఉంటేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని" పేర్కొన్నారు. ఉపాధ్యాయులు చూపిన మార్గంలో నడుస్తూ, కష్టపడి చదివి పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆమె ఆకాంక్షించారు.

**ఘనంగా సన్మానం**

విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న హెచ్‌ఎం పిన్నిలా సేవలను గుర్తించి, గిరిజన సంఘం నాయకులు అజ్మీర వీరన్న - మమత దంపతులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ బృందాన్ని ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని పదో తరగతి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యార్థిని చితకబాదిన టీచర్

**- కోరుట్ల పట్టణంలోని ఓ పాఠశాలలో ఘటన**
**- తల్లిదండ్రుల ఆగ్రహం**

**వేద న్యూస్, కోరుట్ల:**



జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయురాలు విద్యార్థిని చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కోరుట్లలోని గౌతమ్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న సాత్విక్ అనే విద్యార్థిని మంగళవారం ఉపాధ్యాయురాలు కర్రతో కొట్టినట్లు విద్యార్థి బంధువులు ఆరోపించారు. పిల్లలు ఆడుకుంటున్న సమయంలో జరిగిన చిన్నపాటి గొడవపై కోపోద్రిక్తురాలైన టీచర్ విద్యార్థిపై దాడి చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో సాత్విక్ ఎడమచేతి, వీపు భాగంలో తీవ్ర గాయాలు కాగా శరీరంపై రక్తం గడ్డకట్టినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. గాయపడిన బాలుడిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై బాలుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి గొడవ జరిగితే తల్లిదండ్రులకు తెలియజేయాల్సిందిపోయి విచక్షణారహితంగా కొట్టడం సరైంది కాదని ఆరోపించారు. పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించగా కేవలం క్షమాపణలు చెప్పి విషయాన్ని ముగించేందుకు ప్రయత్నించారని వాపోయారు. విద్యార్థులపై ఇలాంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# గ్రామ అభివృద్ధే లక్ష్యం

**- ఎక్లాస్పూర్ సర్పంచ్ రజిత శ్రీనివాస్**

**వేద న్యూస్, మంథని:**



గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఎక్లాస్పూర్ గ్రామ సర్పంచ్ బొడ్డు రజిత శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మంథని మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామపంచాయతీ రెండో వార్డులో నీటి సమస్యను పరిష్కరించేందుకు కొత్త సింగిల్ ఫేజ్ మోటార్ ఏర్పాటు చేశారు. వేసవిలో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ గ్రామంలోని ప్రతి వార్డులో తాగునీటి సమస్యలు లేకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండో వార్డు సభ్యురాలు తగరం రాణి మాట్లాడుతూ వార్డులో నీటి సమస్య ఉందని తెలియగానే వెంటనే స్పందించి సింగిల్ ఫేజ్ మోటార్ ఏర్పాటు చేసిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పర్వతాలు యాదవ్, వార్డు సభ్యులు బండి లావణ్య శంకర్, గువ్వల రాజు, రాదండి దేవమ్మ రాజనర్సి, పంచిక దేవేందర్, గుడిమల్ల తిరుపతి, జంజర్ల శశికళ ప్రభు, బర్ల రజిత సురేందర్, గంట ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, మాజీ ఎంపీటీసీ మంథని లక్ష్మణ్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపాలి

**- భారతీయ మజ్దూర్ సంఘ్ డిమాండ్**
**- మేయర్ శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పణ**

**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ నగరంలోని వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నాయకులు నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలోని ప్రధాన రహదారులు, మున్సిపల్ కార్యాలయాల పరిసరాల్లో కూరగాయలు, ఇతర చిరు సామాగ్రి విక్రయిస్తూ అనేక మంది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. అయితే తరచూ మున్సిపల్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు తమ సామాగ్రిని జప్తు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ బంగ్లా ఎదురుగా నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీని ద్వారా వీధి వ్యాపారులకు శాశ్వత వేదిక లభిస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ సిద్ధమయ్యే వరకు వ్యాపారులు ప్రశాంతంగా వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్, జిల్లా కార్యదర్శి తౌర్తి శ్రీనివాస్, స్ట్రీట్ వెండార్స్ నాయకులు ఆకుల తిరుపతి, నక్క అరుణ్, రమణయ్య, శ్రీనివాస్, మంజూల తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రజల దాహార్తిని తీర్చిన సర్పంచ్

**- కొత్త బోరు ఏర్పాటు**

**వేద న్యూస్, చందుర్తి:**



గ్రామంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలను దృష్టిలో ఉంచుకుని చందుర్తి మండలం దేవుని తండా గ్రామ పరిధిలోని జలపతి తండాలో కొత్త బోరు వేయించి మోటార్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు సర్పంచ్ భుక్య మోహన్ తెలిపారు. గత కొన్ని రోజులుగా నీటి కొరతతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సర్పంచ్ వెంటనే స్పందించి ఉపసర్పంచ్, పాలకవర్గం సహకారంతో బోరు తవ్వించి ప్రజలకు నీరు అందేలా చర్యలు తీసుకున్నారు. గ్రామ ప్రజల దాహార్తిని తీర్చినందుకు తండా వాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భుక్య మోహన్ మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత మరియు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

వేద న్యూస్

గురువారం మార్చి 12, 2026

# విద్యార్థులకు బహుమతుల ప్రదానం



**వేద న్యూస్, వరంగల్:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. వరంగల్ నగరంలోని అండర్ రైల్వే బ్రిడ్జి సమీపంలోని పెరకవాడలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్, బిసిటియు వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి ఆధ్వర్యంలో ఈ పోటీలను తరగతుల వారీగా నిర్వహించారు. మహిళా దినోత్సవానికి సంబంధించిన చిత్రాలను అద్భుతంగా గీసిన విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా క్విజ్ పోటీలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎమ్మెల్యేతో కలిసి పలు హోటళ్ల పరిశీలన



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ కమాన్ చౌరస్తాలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలనపై అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పలు హోటళ్లను సందర్శించి ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని నిర్వాహకులకు సూచించారు. హోటళ్లలో ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ పాత్రలను ఉపయోగించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, పలువురు కార్పొరేటర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# వాగ్దేవిలో అన్వేషణ-2026 ప్రాజెక్ట్ ఎక్స్‌పో

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, బొల్లికుంటలో సంస్థ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) ఆధ్వర్యంలో విబా ఫౌండేషన్ సహకారంతో 'అన్వేషణ-2026.. షోకేసింగ్ ప్రాజెక్ట్ బ్రిలియెన్స్' పేరుతో విద్యార్థుల ప్రాజెక్ట్ ఇన్నోవేషన్ ఎక్స్‌పో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టెక్నాలజీ విభాగాలకు చెందిన విద్యార్థులు సమాజం మరియు పరిశ్రమల్లో ఎదురవుతున్న సమస్యలకు సాంకేతిక ఆధారిత వినూత్న పరిష్కారాలను తమ ప్రాజెక్టుల ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా. కె. ప్రకాష్ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డా. కె. తిరుపతి రావు, డీన్ డా. పి. శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇన్నోవేషన్ మరియు స్టార్టప్‌ల దిశగా ముందుకు సాగాలని సూచించారు. వాగ్దేవి మేనేజ్‌మెంట్ విద్యార్థుల ఆవిష్కరణలకు పూర్తి మద్దతు అందిస్తూ ఇంక్యుబేషన్, మెంటరింగ్ మరియు స్టార్టప్ మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ అడ్వైజర్ గోవిల్ అలోక్, సన్‌రైజ్ మిత్ర గ్లోబల్ టెక్నాలజీస్ సంస్థ వ్యవస్థాపకుడు అండ్ సీఈఓ చందా



సాయి కృష్ణ విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమాన్ని ఐఐసి కోఆర్డినేటర్ డా. ఏ. స్వేత, విబా ఫౌండేషన్ మేనేజర్ ఎం. సాయికిరణ్, కోఆర్డినేటర్ సలీం సమన్వయంతో నిర్వహించారు. అన్ని ఇంజినీరింగ్ విభాగాల హెచ్ఓడీలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



**వేద న్యూస్, కారేపల్లి :**

ఆధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక బాధ్యతను చాటుకుంటూ, కారేపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పగడాల మంజుల - మోహన్ కృష్ణ దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. మండల కేంద్రమైన అప్పాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని తులస్య తండా గ్రామంలో వెలసిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి వారు అండగా నిలిచారు. పహారీ గోడ నిర్మాణం కోసం ఆర్థిక తోడ్పాటు ప్రస్తుతం తులస్య తండాలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ పహారీ గోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పుణ్యకార్యానికి తమ వంతు సహకారంగా పగడాల మంజుల - మోహన్ కృష్ణ దంపతులు 5వేల రూపాయల నగదును బుధవారం విరాళంగా అందజేశారు. దైవ కార్యాల్లో భాగస్వాములు కావడం తమకు ఎంతో సంతోషాన్నిస్తోందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తక్షణమే స్పందించి ఆర్థిక సాయం అందించిన పగడాల దంపతులకు తులస్య తండా గ్రామస్తులు మరియు భక్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భూక్యా రాములు, పాల్తియా శివాజీ, గుగులోత్ వీరన్న, సభావట్ నాగులు, వాంకుడోత్ లక్క తదితరులు పాల్గొని విరాళాన్ని స్వీకరించారు.

# నేతాజీపై వ్యాసరచన పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం



**వేద న్యూస్, బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో బుధవారం భారత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జ్ఞాపకార్థం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. "భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర" అనే అంశంపై నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు అమీరి శెట్టి భూమి రెడ్డి, తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహోన్నత నాయకుడని కొనియాడారు. విద్యార్థులు ఆయన పోరాట స్ఫూర్తిని తెలుసుకుని దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా నాయకులు గడ్డం తిరుపతి, వంశీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించాలి

- బీజేపీ జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మలుమూరి శ్రీనివాస్



**వేద న్యూస్, రామగిరి:**

సింగరేణి కంపెనీలో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం మెడికల్ బోర్డు వెంటనే నిర్వహించాలని బీజేపీ జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మలుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గత కొన్ని నెలలుగా మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు మెడికల్ బోర్డు కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ నిర్వహించకపోవడం సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కార్మిక సంఘాలన్నీ కలిసి చిన్నచిన్న సమస్యలకే పరిమితం కాకుండా మెడికల్ బోర్డు నిర్వహణ కోసం సింగరేణి వ్యాప్తంగా కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికులకు వెంటనే కారుణ్య నియామకం ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సింగరేణి కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అవసరమైతే కార్మిక సంఘాలు సమ్మెకు కూడా వెనుకాడవద్దని సూచించారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మలుమూరి శ్రీనివాస్ తెలిపారు

# భగ్గుమంటున్న చికెన్, గుడ్డు!

- ధరల పెరుగుదలతో సామాన్యుల ఇబ్బందులు





**వేద న్యూస్, బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో రోజురోజుకు పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగి భారంగా మారగా ఇప్పుడు కోడి మాంసం, కోడిగుడ్డు ధరలు కూడా అమాంతం పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకప్పుడు పేదవాడి ప్రోటీన్ ఆహారంగా పేరుగాంచిన కోడిగుడ్డు ఇప్పుడు సామాన్యుడికి అందనంత దూరంగా మారుతోంది. ఇటీవల వరకూ తక్కువ ధరకే లభించిన గుడ్డు ధరలు ఒక్కసారిగా పెరగడంతో పేద కుటుంబాలు కొనుగోలు చేయడంలో వెనకడుగు వేస్తున్నాయి. పిల్లల పోషణ కోసం ప్రతిరోజూ గుడ్లు కొనేవారు ఇప్పుడు వారానికి ఒకసారి కూడా కొనలేని పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కోడి మాంసం ధరలు కూడా భారీగా పెరగడంతో చాలా కుటుంబాలు కొనడానికి వెనుకంజ వేస్తున్నాయి. పండుగలు లేదా ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే చికెన్ కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. కోళ్ల పెంపకంలో ఖర్చులు పెరగడం, పశుగ్రాసం ధరలు అధికమవడం, రవాణా వ్యయాలు పెరగడం, వాతావరణ మార్పులు మరియు సరఫరా తగ్గడం వల్లే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ధరల పెరుగుదల వల్ల ఎక్కువగా నష్టపోతున్నది సామాన్య ప్రజలేనని, గుడ్లు-చికెన్ ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే పేదవాడికి అందుబాటులో ఉండే ఆహారం కూడా దూరమయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 99రోజుల కార్యాచరణతో మారుతున్న పల్లె ముఖచిత్రం



**వేద న్యూస్,కారేపల్లి :**

భజ్యాతండా గ్రామపంచాయతీ అభివృద్ధికి కట్టు బడి ఉన్నామని సర్పంచ్ వాంకుడోత్ హను మంతరావు తెలిపారు.సింగరేణి మండల పరిధి లోని భజ్యాతండా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నట్లు సర్పంచ్ హనుమంతరావు బుధవారం తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో చెత్తా చెదారాలను సేకరించి డంపింగ్ షెడ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు.రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ సమస్యలను గుర్తిస్తున్నట్లుగా తెలిపారు.అనంతరం రోడ్ల వెంబడి పిచ్చి మొక్కలను తొలగించారు.తొలగించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ షెడ్డుకు తరలించారు.రోడ్డు వెంబడి డ్రైనేజీలను శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, అంగన్వాడీ టీచర్లు,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్స్పెక్టర్లు తనిఖీలు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని పలు మెడికల్ షాపుల్లో బుధవారం డ్రగ్ ఇన్స్పెక్టర్లు శ్రీలత, శ్రీకాంత్ లు ఆకస్మికం గా తనఖీ నిర్వహించారు. మెడికల్ షాపుల్లోని రిజిస్టార్లను పరిశీలించారు. కాలం చెల్లిన మందులను విక్రయిం చరాదని, డాక్టర్ చీటీ లేకుండా మందులు ఇవ్వవద్దని మెడికల్ నిర్వాహకులకు సూచించారు. ప్రతి మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టు తప్పనిసరిగా ఉండాలని, ఫాట్మాసిస్టులేని మెడికల్ షాపులపై చట్ట పరమైన చర్యలు తీసుకొని దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

# షీటీం పై విద్యార్థులకు అవగాహన



**వేద న్యూస్, కోటగిరి :**

కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం షీటీం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల రక్షణకు భద్రత కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని అన్నారు. అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు, లోన్ యాప్స్ కు గురవుతున్నారని వాటి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటగిరి ఎస్సై సునీల్, షీ టీం బృందం, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం మార్చి 12, 2026

# నిరుపేద కుటుంబానికి ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ ఆర్థిక సహాయం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన దాల్ మల్క బాబయ్య కుమార్తె దాల్ మల్క సోని వివాహం కొరకు స్థానిక బీజేపీ నాయకులను వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం కొరకు ఆశ్రయించగా విషయం తెలుసుకున్న బాన్సువాడ బిజెపి నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ వెంటనే స్పందించి తన వంతు ఆర్థిక సహాయంగా 5,000 రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండూరు ప్రశాంత్ గౌడ్, బాన్సువాడ బీజేపీ సీనియర్ నాయకులు వాంకర్ రామరాజ్, రుద్రూర్ మండల బీజేపీ అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, ఉపాధ్యక్షులు భోజిగౌండ అనిల్, యువ మోర్చా మండల అధ్యక్షులు కుమ్మరి గణేష్, బూత్ అధ్యక్షులు దాల్ మాల్క గోపి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన చెక్కు పంపిణీ

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ లో గ్రామానికి చెందిన ఎర్రోళ్ల పోశెట్టి అనే వ్యక్తి ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకం తీసుకొని ఉన్నారు. ప్రస్తుతం ఆ వ్యక్తి మరణించినందున వారి నామిని అయినా ఎర్రోళ్ల లక్ష్మి కి క్లైయిమ్ రెండు లక్షల చెక్కును లబ్ది దారురాలికి అందించారు. బ్యాంకు ఖాతాదారులు ఈ భీమా సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని కెనరా బ్యాంక్ మేనేజర్ డి. ఈరు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ లఖన్, జ్ఞానేశ్వర్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాలు కేటాయించాలని నాయబ్ తహసీల్దార్ కు వినతి

**వేద న్యూస్, పోతంగల్ :**



నిరుపేదలైన తమకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని పోతంగల్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం నాయబ్ తహసిల్దార్ అబ్దుల్ అజీజ్ కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోనీ ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 171 ఆక్రమణకు గురైందని విషయంపై చర్యలు తీసుకోవాలని విన్నవించుకున్న అధికారులు పట్టించు కోవడమలేదని అన్నారు. ఇప్పటికైనా అదికారులు స్పందించి స్థలాన్ని సర్వే చేయించి నిరుపేదలకు అందజేయాలని వినతి పత్రం అందజేస్తున్నట్లు వివరించారు. లేని యెడల ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తామని పేర్కొన్నారు.

# ఉద్యాన రైతులకు శిక్షణ కార్యక్రమం



**వేద న్యూస్, పోతంగల్ :**

పోతంగల్ మండల కేంద్రంలోని కొడిచర్ల గ్రామంలో తెలంగాణ ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం ఉద్యాన పంటలపై రైతు అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ భారతి రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. మిషన్ ఆన్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్ లో భాగంగా ప్రభుత్వం ఉద్యాన రైతులకు అందిస్తున్నటువంటి సబ్సిడీలు, పథకాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన స్థానం రుద్రూర్ నుంచి ఎం. సాయిచరణ్, కీటక శాస్త్రవేత్త రైతులు మిరప సాగులో నల్ల తామర పురుగులను నల్లిని నివారించేందుకు పాటించవలసిన సమగ్ర సస్యరక్షణ చర్యలని రైతులకు వివరించారు. వీటితోపాటు వివిధ కూరగాయ పంటల్లో రైతులు పాటించవలసిన సమగ్ర సస్యరక్షణ చర్యలను రైతులకు తెలియజేశారు. రైతులు క్షేత్రస్థాయిలో ఆరోగ్యకరమైన పంటని పెంచడానికి తీసుకోవలసిన వివిధ జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్నటువంటి వివిధ పథకాల యొక్క ఫలాలు అందుకోవడానికి గల విధివిధానాలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమం అనంతరం ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్త మిరప సాగు చేస్తున్న రైతు పొలాలను సందర్శించారు. మిరపలో నల్ల తామర పురుగులను గమనించారు. వీటిని నియంత్రించడం కోసం పొలంలో ఒక ఎకరాకు 30 నుంచి 35 నీలిరంగు జిగురు అట్టలను అమర్చుకోవాలని సూచించారు. అదేవిధంగా బ్రోఫ్ల నిలైడ్ 34 మి. లీ లేదా డైఫెంతియురాన్ 300గ్రాములు లేదా ఫిప్రోనిల్ 80 డబ్ల్యూ 20 గ్రాములు ఒక ఎకరాకు మార్చి మార్చి పిచికారీ చేయాలని సూచించారు. ఈ అవగాహనా కార్యక్రమంలో అస్రర్ - హెచ్ఈఓ, ఆదర్శ రైతు శంకర్, ఇతర కూరగాయలు సాగు చేసే 60 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- గంగాధర మండలంలో మహిళా సంఘ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన



**వేద న్యూస్, గంగాధర:**

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలు ఆర్థిక, రాజకీయ రంగాల్లో శక్తివంతంగా ఎదగడానికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. గంగాధర మండలంలోని కొండన్నపల్లి, హిమ్మత్ నగర్, చిన్నా చంపల్లి, ఉప్పరమల్యాల, గోపాలరావుపల్లి, ఇస్లాంపూర్, వెంకటాయపల్లి, కొండాయపల్లి, చర్లపల్లి (ఆర్), ర్యాలపల్లి, లింగంపల్లి గ్రామాల్లో రూ. 1.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘ భవనాల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఇస్లాంపూర్ గ్రామంలో ఎల్లమ్మ దేవాలయం ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలు మహిళల పేరుతో అమలవుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దమ్మని రాము, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, రెండ్ల శ్రీనివాస్, బిర్ల ఆనందం, గుడి రజిని ప్రవీణ్, బారజు ప్రభాకర్ రెడ్డి, బాసవేణి శ్రీనివాస్, అరె తేజ శ్రీ రాజశేఖర్, దాసరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సంఘాల భవనాల నిర్మాణానికి భూమి పూజ

- మహిళా శక్తి పథకాలపై అవగాహన

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో బుధవారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బోయినిపల్లి గ్రామంలోని ధరిత్రి, శ్రీలక్ష్మి తులసి గ్రామ సంఘాల భవనాల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళా శక్తి కార్యక్రమాలు మరియు మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. జాగృతి మండల సమాఖ్య సభ్యులకు ఈ ఏడాది రూ. 45 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా అందిస్తున్న క్యాటిల్ షెడ్లు, పౌల్ట్రీ ఫారమ్‌లకు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బంది, సంఘాల అధ్యక్షులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ ఎం. గీత, ఎంపీడీవో జయశీల, మండల పంచాయతీ అధికారి శ్రీధర్, ఏఎంసీ అధ్యక్షుడు ఎల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు వినోద్ రెడ్డి, బోయినిపల్లి సర్పంచ్ మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణా రెడ్డితో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామీణ మహిళల సాధికారతకు మరో అడుగు

- రామన్నపేటలో ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రామన్నపేట గ్రామంలో స్వప్న స్వదేశ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా తొలి విడతలో 20 మంది మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ స్వప్నరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సర్పంచ్ కవిత వెంకట్ రెడ్డి, స్తంభంపల్లి సర్పంచ్ బొంగని అశోక్, వర్ధవెల్లి సర్పంచ్ చల్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామీణ మహిళల అభివృద్ధి కోసం ఉచిత శిక్షణ అందిస్తున్న సంస్థను అభినందించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి సాధించాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందనున్న మహిళలకు యూనిఫామ్‌లు, టూల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, మాజీ ఉపసర్పంచ్‌లు రాములు, భూమయ్య, సుధాకర్ రెడ్డి, అనీల్ రెడ్డి, మెరుపుల మహేష్, సతీష్, వేణు, మహేష్, కిషన్, నాగార్జున్, సురేష్, శ్రీను, అనీల్తో పాటు సంస్థ వాలంటీర్లు పాల్గొన్నారు.

# 13న జెడ్పీ పాఠశాలలో క్రీడా పాఠశాల ప్రవేశాల ఎంపికలు

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రేపు క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఎన్. శ్రావణ్ కుమార్ తెలిపారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరానికి హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్, హనుమకొండలోని క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాల కోసం విద్యార్థులు ఈ నెల 12వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు https://tgss.telangana.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. 2017 సెప్టెంబర్ 1 నుంచి 2018 ఆగస్టు 31 మధ్య జన్మించిన విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో

- ఆర్మ్‌డ్ రిజర్వ్ పాత్ర కీలకం
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ విభాగం కూడా కీలక పాత్ర పోషిస్తున్నదని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. సాయుధ దళాల వార్షిక పునర్ ఉచ్చరణ (మోబిలైజేషన్) ముగింపు కార్యక్రమంలో భాగంగా పరేడ్ మైదానంలో నిర్వహించిన సాయుధ దళాల సమీకరణ కవాతు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. వార్షిక మోబిలైజేషన్ శిక్షణలో భాగంగా ఆర్మ్స్ డ్రిల్, లాఠీ డ్రిల్, ఫుట్ డ్రిల్, సెర్మోనియల్ డ్రిల్, గార్డ్ మౌంటింగ్, మాబ్ ఆపరేషన్, ఫైరింగ్, నాకబంది, పికెట్స్, వీఐపీ బందోబస్త్ విధులు, ప్రిసనర్ మరియు క్యాష్ ఎస్కార్ట్ వంటి అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు. పోలీసులు తమ శారీరక దారుఢ్యాన్ని కాపాడుకుంటూ విధుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్పీ సూచించారు. అనంతరం సార్ధపూర్ బెటాలియన్ ఫైరింగ్ రేంజ్‌లో నిర్వహించిన ఫైరింగ్ శిక్షణను ఎస్పీ పర్యవేక్షించి స్వయంగా ఫైరింగ్ ప్రాక్టీస్ కూడా చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్.ఐలు, ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది

# ఘనంగా స్వయంపాలన

**వేద న్యూస్, పాపన్నపేట :**



ప్రాథమికోన్నత పాఠశాల రామతీర్థంలో బుధవారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడు మరియు ఆరవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. కలెక్టర్ గా కార్తీక్, డీఈఓ గా వర్షిత్, ఎంఈఓ గా అఖిల, ప్రధానోపాధ్యాయురాలుగా దుర్గమణి, ఉపాధ్యాయులుగా అక్షయ, పొచమని, కీర్తన, ప్రవీణ్, రాం చరణ్, శైలజ, నవనీత, కృష్ణసాయి, పి ఇ టి గా చరణ్, మరియు అటెండర్ గా హరీష్ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు యెల్లం, ఉపాధ్యాయులు స్వప్న, దివ్య సంగీత, నాగరాజ్ పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ సాయిరెడ్డి,చైర్మన్ గోపికమ్మ లు హాజరైనారు. స్కావెంజర్ స్వరూప, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కాల్వ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- రైతు ఏడ్చిన చోట రాజ్యం నిలువదు
- నెల రోజుల నుంచి రిలే దీక్ష చేపట్టిన పట్టించుకోరా
- మాజీ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో రంగనాయక సాగర్ 11/6 కాల్వ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎద్దు ఎడిచిన చోట ఎవుసం ఉండదు.. రైతు ఏడ్చిన చోట రాజ్యం నిలువదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ-11 (ఆర్డీ3 ఎల్ఎం6) కాల్వ పనులను పూర్తి చేయాలని పెద్దలింగాపూర్, రామోజీపేట, నరసింహులపల్లి సహా 12 గ్రామాల రైతులు గత నెల రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. సిద్ధిపేట జిల్లాలోని రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి ఇల్లంతకుంట మండలానికి సాగునీరు అందించేందుకు చేపట్టిన ఎల్ఎం6 కాల్వ పనులు చివరి దశలో నిలిచిపోయాయని తెలిపారు. ఏడాది క్రితం ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు పనులు ముందుకు సాగలేదని అన్నారు. సాగునీరు లేక యాసంగి సీజన్‌లో వందల ఎకరాల్లో వరి, మక్క పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రైతులకు ఇవ్వాల్సిన రూ. 3.20 కోట్ల పరిహారం కూడా ఆలస్యమవుతోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎల్ఎం6 కాల్వ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సబ్బుల బాలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# నమ్మించి మోసం.. నగదుతో పరారీ



**వేద న్యూస్, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఉన్న శ్రీ నిలయ షాపింగ్ మాల్‌లో చిల్లర మార్పిడి పేరుతో ఓ వ్యక్తి నగదుతో పరారైన ఘటన చోటుచేసుకుంది. తనకు గాంధీ విగ్రహం సమీపంలో పాన్ షాప్ ఉందని, తన వద్ద రూ.4 వేల చిల్లర ఉందని చెప్పి వాటికి బదులుగా నోట్లు ఇవ్వాలని షాపింగ్ మాల్ యజమానిని కోరాడు. చిల్లర అవసరమని భావించిన యజమాని సెక్యూరిటీ గార్డును ఆ వ్యక్తితో పంపించి నగదు ఇచ్చాడు. సెక్యూరిటీతో కలిసి వెళ్లిన వ్యక్తి ఒక చోట ఆగి 'నువ్వు ఇక్కడే ఉండు, లోపలికి వెళ్లి చిల్లర తీసుకువస్తాను' అని చెప్పి గార్డు వద్ద ఉన్న డబ్బులు తీసుకుని లోపలికి వెళ్లాడు. అయితే ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో సెక్యూరిటీ గార్డు అనుమానం వచ్చి చుట్టుపక్కల వెతికినా ఆ వ్యక్తి కనిపించలేదు. ఈ ఘటనతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఇలాంటి మోసగాళ్లు తిరుగుతున్న నేపథ్యంలో వ్యాపారస్తులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు



**వేద న్యూస్, సిరిసిల్ల:**

సిరిసిల్లలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు దాసరి రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు తమ సీనియర్లకు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మరిపెద్ది ఉమ, 29వ వార్డు కౌన్సిలర్ గెంట్యాల శ్యామల శ్రీనివాస్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థి జీవితంలో కీలక దశ అని, క్రమశిక్షణతో చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు

# ఘనంగా వీడ్కోలు సమావేశం



**వేద న్యూస్, పాపన్నపేట :**

మండల కేంద్రమైన పోడ్చన్ పల్లి పాఠశాలలో అయిదేళ్ల ప్రయాణం వెలకట్టలేని స్నేహాలు కన్నతండ్రిలా విద్యాబుద్ధులు నేర్పిన గురువులు.. ఇవన్నీ ఒక ఎత్తైతే, ఇప్పుడు ఆ పాఠశాల దాటి వెళ్తున్నామన్న బాధ మరో ఎత్తు. పాపన్నపేట మండలం పోడ్చన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం అత్యంత భావోద్వేగాల మధ్య జరిగింది. 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఈ వీడ్కోలు సమావేశం కేవలం వేడుకగానే కాకుండా ఆత్మీయ కలయికగా మారింది. పాఠశాల ప్రాంగణంలో గడిపిన ప్రతి క్షణం విద్యార్థుల కళ్లముందు కదలాడాయి. తమను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల కు నమస్కరిస్తూ విద్యార్థులు కృతజ్ఞతలు తెలుపుతున్నప్పుడు పలువురి కళ్లు చెమర్చాయి. ఉపాధ్యాయులు నేర్పిన పాఠాలు తమ జీవితాలకు వెలుగునిస్తాయంటూ విద్యార్థులు ఉద్వేగంగా ప్రసంగించారు. తరగతి గదిలో చేసిన సందడి, ఆటస్థలంలో కొట్టిన కేరింతలు, మధ్యాహ్నం పూట భోజనాలు పంచుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు కౌగిలించుకుని వీడ్కోలు చెప్పుకున్నారు. రేపు పాఠశాల గంట మోగితే తాము ఇక్కడ ఉండమన్న ఆలోచన వారిని కలిచివేసింది. అయితే తమ సీనియర్ల భవిష్యత్ అంతా బంగారుమయంగా ఉండాలని 9వ తరగతి విద్యార్థులు ఆకాంక్షించి వారిని సాగనంపారు. వీడ్కోలు అంటే విడిపోవడం కాదు..కొత్త శిఖరాలను అధిరోహించేందుకు చేసే మరో ప్రయాణం అని ఉపాధ్యాయులు విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట ఎంఈఓ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో పాఠశాల దశ ఎంతో కీలకమని, ఇక్కడ పొందిన విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలు వారి భవిష్యత్‌ను దిశానిర్దేశం చేస్తాయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకుంటూ పదవ తరగతి పరీక్షల విషయం లో విద్యార్థుల కు విలువైన సూచనలు అందించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అలరిస్తూ ఉత్సాహాన్ని నింపాయి.ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్, ,కె. కిషన్, పి. భద్రయ్య, జి.భవానీప్రసాద్, డి. గన్ను, సుబ్బారావు, శివశంకర్,శివలింగం గౌడ్, చంద్రకాంత్,డాక్టర్ బి. దేవయ్య, శశికళ పి డి మహిపాల్ , పాషా లు పాల్గొన్నారు

# “ పది“ విద్యార్థులకు హాల్ టికెట్లు, పరీక్షా సామాగ్రి అందజేత



**వేద న్యూస్, పాపన్నపేట:**

మండల పరిధిలోని కుర్తివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు, పరీక్షా సామాగ్రి అందజేశారు. ఈ సంద ర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యతో సంపూర్ణమైన వికాసం సిద్ధిస్తుం దని, విద్యార్థులు కష్టపడి చదివి, శతశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అంతకుముందు పదో తరగతి విద్యార్థులకు పాఠశాల వీడ్కోలు పలికింది. సమావేశంలో విద్యార్థులు వారి వారి అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ శ్రీధర్ విచ్చేసి పదో తరగతిలో గరిష్ట మార్కులు పొందిన విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తానన్నారు. తాజా మాజీ సర్పంచ్ కొత్తూరి స్రవంతి శ్రీనివాస్, యువజన నాయకులు పుట్టి కిరణ్ కార్యక్రమానికి హాజరై పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేశారు. ఉన్నతంగా ఎదిగి ఊరికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ సౌందర్య తోపాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్



**వేద న్యూస్, మంథని:**

మతసామరస్యానికి ప్రతీక పవిత్రమైన రంజాన్ పండుగ అని మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మంథని మున్సిపల్ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దపెల్లి జిల్లా అదనపు కలెక్టర్ వేణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉపవాస దీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్ రెడ్డి, తహసిల్దార్ అరిఫుద్దిన్, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కాలేజీల దౌర్జన్యం నశించాలి

- బొబ్బిలి అక్షయ్

**వేద న్యూస్, మెట్‌పల్లి:**

కోరుట్ల, మెట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రైవేట్ కాలేజీలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో ఉన్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు బహుజన్ సమాజ్ పార్టీ ఆరోపించింది. ఈ వ్యవహారాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ బొబ్బిలి అక్షయ్ తెలిపారు. పేద విద్యార్థుల విద్య కోసం ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ, కాలేజీ యాజమాన్యాలు ఫీజులు రాలేదని చెప్పి తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయని అన్నారు. డబ్బులు చెల్లించకపోతే హాల్ టికెట్లు ఇవ్వకపోవడం, సర్టిఫికెట్లు నిలిపివేయడం వంటి చర్యలు తీసుకోవడం అన్యాయమని విమర్శించారు. ఇప్పటికే వసూలు చేసిన డబ్బులను వెంటనే తిరిగి ఇవ్వాలని, లేకపోతే బాధిత విద్యార్థుల తరఫున కాలేజీల ముందు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. విద్యాశాఖ, సోషల్ వెల్ఫేర్ అధికారులు వెంటనే స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న కాలేజీలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# అక్రమ ఇసుక వేలంతో రూ.4లక్షల 15వేల ఆదాయం



- తహసిల్దార్ సతీష్ కుమార్

**వేద న్యూస్, పాపన్నపేట :**

అక్రమ ఇసుక వేలం ద్వారా రూ.4లక్షల 15వేల 935 ఆదాయం వచ్చినట్లు పాపన్నపేట తహసిల్దార్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం రోజు మాట్లాడుతూ పాపన్నపేట మండల పరిధిలోని గాజుల గూడెం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 237ట్రాక్టర్ల ఇసుకను వేలం వేయగా గ్రామానికి చెందిన ప్రతాప్ గౌడ్ అనే వ్యక్తి అత్యధికంగా వేలం పాట పాడి రూ.4లక్షల 15వేల 935 లకు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాపన్నపేట రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్తు స్వామీ, గ్రామ ప్రజలు బాలాగౌడ్,గుణిశెట్టి మల్లేశం,పార్థివ రెడ్డి,మంగలి మురళి తదితరులు పాల్గొన్నారు.

# జనగణన పకడ్బందీగా పూర్తిచేయాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జనగణన-2027 కార్యక్రమాన్ని పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. జన గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో మే 11 నుంచి జూన్ 9 వరకు ఇండ్ల గణన, రెండో దశలో ఫిబ్రవరి 2027లో వ్యక్తుల వివరాల సేకరణ జరుగుతుందని తెలి పారు. ఈసారి రాష్ట్రంలో డిజిటల్ విధానంలో జనగణన నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాల రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు జనగణన కీలకమని, అధికారులు తమ బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అద నపు కలెక్టర్ గడ్డం నగేష్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీ డీవోలు పాల్గొన్నారు

# రగ్గుల పంపిణీ



**వేద న్యూస్,పాపన్నపేట :**

అందరితో కలిసిమెలిసి ఉంటూ, చిరునవ్వుతో పలకరించే నాగ్సన్ పల్లి గ్రామానికి చెందిన హోంగార్డు తలారి మహేందర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన జ్ఞాపకాలు మాత్రం అందరి వెన్నంటే ఉన్నాయని కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులు గుర్తు చేసుకున్నారు. మెదక్ లో హోంగార్డ్ ఉద్యోగం చేస్తూ గత ఏడాది (2025) మార్చి 11న గుండెపోటుతో అకాల మరణం చెందిన తలారి మహేందర్ ప్రథమ వర్ధంతిని బుధవారం ఆయన స్వగ్రామం నాగ్సాన్ పల్లిలో ఘనంగా నిర్వహించారు.మహేందర్ జ్ఞాపకార్థం గ్రామంలోని పేదలకు, వృద్ధులకు దుప్పట్లు మరియు రగ్గులను పంపిణీ చేశారు. పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేస్తూ విధి నిర్వహణలో నిబద్ధత చాటుకున్న మహేందర్, గతేడాది ఇదే రోజున అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మరణించారు. ఆయన మరణం చెంది ఏడాది కావస్తున్నా, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గ్రామస్థులు కళ్ళకు కట్టుకున్నట్లు వివరించారు. అందరితో ఆప్యాయంగా ఉండే మహేందర్ అకాల మరణం తమను నేటికీ కలిచివేస్తోందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులు భాగ్యలక్ష్మి, కౌశిక్,స్రుజన్,సిద్దేశ్వర్,రాము టేక్మల్ నాయికోటి భాస్కర్.కృష్ణ.రాజు.సురేష్. వృద్ధులు తదితరులు పాల్గొని పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేద న్యూస్

గురువారం మార్చి 12, 2026

# చలివేంద్రం ప్రారంభించిన ఎస్సై



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణంలోని ప్రధాన రహదారిపై చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చొప్పదండి ఎస్సై నందిరెడ్డి నరేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఆరు సంవత్సరాలుగా ఇలాంటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వివిధ పనుల కోసం పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇటువంటి చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అనంతరం ఓదెల రాజయ్య జ్ఞాపకార్థం 300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జిట్టా కుమార్, మహేశుని మల్లేశం, మహమ్మద్ చాంద్ పాషా, చిట్యాల శ్రీకాంత్, ఓదెల రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గీతా విద్యాలయంలో టెన్త్ విద్యార్థులకు ఫేర్వెల్ పార్టీ



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణంలోని గీతా విద్యాలయం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు భవిష్యత్‌పై విలువైన సలహాలు, సూచనలు చేశారు. అనంతరం పాఠశాల యాజమాన్యం అతిథులను ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఆనంద్ రెడ్డి, డైరెక్టర్ లింగారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి మిత్రుల ఆర్థిక సహాయం



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణం ఇందిరానగర్‌కు చెందిన గుండెటి విజయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతని కుటుంబానికి మిత్రులు ఆర్థిక సహాయం అందించారు. చిన్ననాటి మిత్రులు కలిసి రూ. 45,100లను విజయ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులు విజయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్కా తిరుపతిరెడ్డి, సంబోజి సునీల్, బట్టు రాజు, తుమ్మ శీను, నల్లి శేఖర్, అనిల్, బత్తుల నర్సింగం, అంజి, శ్రావణ్, మధు, మహేష్, సతీష్, బాలి వేణు, శ్యామ్ తదితర మిత్రులు పాల్గొన్నారు.

# తిరుపతి దర్శనం పేరుతో భారీ మోసం

## – రూ.18.46 లక్షల లాగేసిన కేటుగాడు

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగిని నమ్మబలికి రూ.18.46 లక్షలు మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. ఓద్యారం గ్రామంలోని వెంకటేశ్వర దేవాలయంలో పూజారిగా పనిచేస్తున్న సాయి తరుణ్ తండ్రి శ్రీనివాస్ అనే వ్యక్తి తిరుపతి దర్శనం, రైలు టిక్కెట్లు బుక్ చేస్తానని ఫోన్ ద్వారా బాధితుడిని నమ్మబలికాడు. అనంతరం దఫాదఫాలుగా మొత్తం రూ.18,46,885లను ఇల్లంతకుంట మండలం నర్సక్కపేట గ్రామానికి చెందిన దామర హరీష్ ఖాతాకు బదిలీ చేయించుకున్నట్లు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

# చిట్టీల పేరుతో రూ.5 కోట్ల మోసం

- నిందితుడు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ సతీష్ బాబు




**వేద న్యూస్, శాయంపేట:**

చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసి సుమారు రూ.5 కోట్లను దోచుకున్న వ్యక్తిని శాయంపేట పోలీసులు అరెస్టు చేశారు. పరకాల ఏసీపీ సి. సతీష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం... పత్తిపాక గ్రామానికి చెందిన పెరుమాళ్ళ కిషోర్ గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వ అనుమతి లేకుండా పెరుమాండ్ల చిట్స్ పేరుతో చిట్టీలు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేశాడు. అధిక వడ్డీ ఆశ చూపి 117 మందితో చిట్టీలు వేయించి, 176 మంది వద్ద నుంచి సుమారు రూ.5 కోట్లను తీసుకుని తిరిగి చెల్లించకుండా మోసం చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు గత నెల 19న శాయంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడిని శాయంపేట సీఐ పి. రంజిత్ రావు, ఎస్సై జక్కుల పరమేశ్వర్ అరెస్టు చేసి అతడి వద్ద నుంచి నగదు, భూముల పత్రాలు, బంగారువెండి ఆభరణాలు, కారు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేని చిట్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిట్టీలో చేరే ముందు రిజిస్ట్రేషన్ వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలని ఏసీపీ సూచించారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు అధికారులను ఆయన అభినందించారు.

# ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య..!

**వేద న్యూస్, పాపన్నపేట:**



ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన ధారబోయిన కృష్ణ, మాధవి(23)లకు ఒక కుమారుడు ఉన్నారు. కృష్ణ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా మాధవి ఆరోగ్యం సరిగా ఉండటం లేదు. ఇంటి ఆర్థిక పరిస్థితి సైతం సరిగా లేకపోవడంతో ఈ క్రమంలో మనస్తాపం చెందిన మాధవి మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాసేపటికి గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# భూదాన్ భూములను పేదలకు పంచాలి

## – గోపగాని శంకర్రావు



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

భూదాన్ భూములను పేదలకు పంచాలని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా నాయకులు గోపగాని శంకర్రావు అన్నారు. నేలకొండపల్లి భక్త రామదాసు ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూదాన్ భూములుగా ఉన్న 62 ఎకరాల భూమి ప్రభుత్వానికి నేరుగా సంబంధం లేదని చట్టాలు, కోర్టులు పేర్కొన్నప్పటికీ పేదల ఇళ్లను కూల్చడం అర్థం కాని చర్యగా ఉందని అన్నారు. పేద ప్రజలు ఎన్నో కష్టాలు పడుతూ తమకు ఉన్న స్వల్ప వనరులతో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న సమయంలో వాటిని కూల్చివేయడం మానవత్వానికి విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పేద కుటుంబానికి కనీసం 100 గజాల స్థలం ఇవ్వాలని ముఖ్యమంత్రి కి,జిల్లా కలెక్టర్లకు ఇప్పటికే వినతిపత్రం అందజేశామని తెలిపారు. ప్రస్తుతం 70 గజాల భూమి ఇవ్వడం సరిపోదని, ఆ స్థలంలో కుటుంబానికి అవసరమైన విధంగా ఇల్లు నిర్మించుకోవడం చాలా కష్టమని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అమలవుతున్న హైడ్రా విధానం మాదిరిగానే ఖమ్మం జిల్లాలో కూడా పారదర్శకంగా వ్యవస్థ ఉండాలని పేద ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అదేవిధంగా కొన్ని రాజకీయ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి సమగ్ర సర్వే నిర్వహించి జిల్లాలో ఉన్న మిగులు భూములను గుర్తించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలా చేస్తే నిజంగా భూమిలేని పేదలకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి జిల్లా నాయకులు మాదాస్ శ్రీను, మండల నాయకులు మందడి వెంకటేశ్వరరావు, వడ్లమూడి వెంకట్ రాములు, నామరపు అచ్చయ్య, బస్వరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మెళకువలు నేర్చుకుంటే గణితం సులభమే

## – డాక్టర్ నరసింహమూర్తి



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

గణిత శాస్త్రంలో మెళకువలు నేర్చుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చని ప్రముఖ గణిత శాస్త్ర నిపుణులు డాక్టర్ నరసింహమూర్తి అన్నారు. బుధవారం దామెర మండలం ఊరుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితం అంటే భయపడాల్సిన అవసరం లేదని, అంశాల వారీగా మెలకువలు తెలుసుకుని ప్రణాళికతో చదివితే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడి లేకుండా ప్రశ్నాపత్రాన్ని పరిశీలించి ఆత్మవిశ్వాసంతో రాయాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వై. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత పాఠశాల విద్య సహాయ సంచాలకులు రామేశ్వర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల అలవాట్లు అలవర్చుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ ఆర్. గణపతి, విజయప్రభ, డాక్టర్ వంగల జగన్, వసుంధర దేవి, స్వరూప రాణి, అర్షం రాజేంద్రప్రసాద్, వంగేటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కేయూలో ఇఫ్తార్ విందు

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు సాయంత్రం 5.30 గంటలకు విశ్వవిద్యాలయ అతిథి గృహంలో ఇఫ్తార్ విందు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి హాజరవుతారు. విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ డాక్టర్ రియాజ్ అహ్మద్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, పాలక మండలి సభ్యులు, వివిధ విభాగాల ఆచార్యులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొననున్నట్లు అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ మహమ్మద్ అసిం ఇక్బాల్ తెలిపారు.

# కేయూ సమస్యలపై తీన్మార్ మల్లన్న సమావేశం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సభ్యులు తీన్మార్ మల్లన్న విశ్వవిద్యాలయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరస్పర సంభాషణ సమావేశం రేపు ఉదయం 11 గంటలకు విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో నిర్వహించబడనున్నది. ఈ సమావేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, వసతి సదుపాయాలు, విద్యా ప్రమాణాలు, హాస్టల్ సమస్యలు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి తగిన పరిష్కార మార్గాలు సూచించే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించబడుతున్నది. విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని విద్యార్థి సంఘాలు తమ ప్రతినిధులతో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని బి.సి. సెల్ సంచాలకులు డాక్టర్ బోడిగే సతీష్ ఒక ప్రకటనలో కోరారు.

# సిటీ కాలేజీలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్

## – '50 ఏళ్ల అత్యవసర పరిస్థితి'పై ఉపన్యాస పోటీలు




**వేద న్యూస్, హైదరాబాద్:**

కేంద్ర యువజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సిటీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్తంగా నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా 50 ఏళ్ల అత్యవసర పరిస్థితి అంశంపై జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పారిశ్రామికవేత్త వాసుదేవ రావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితి భారత చరిత్రలో ఒక చీకటి అధ్యాయమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో కూడా ప్రతిభ కనబరచాలని సూచించారు. జాతీయ యువ పురస్కార గ్రహీత సామల వేణు విద్యార్థులు భావవ్యక్తీకరణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా యూత్ ఆఫీసర్ కుష్బూ గుప్తా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పి. శాంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లాలోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం మార్చి 12, 2026

# గంజాయి అక్రమ రవాణా బట్టబయలు



**వేద న్యూస్, మరిపెడ:**

మరిపెడ మండల కేంద్రంలోని రాజీవ్ సెంటర్ వద్ద గంజాయి అక్రమ రవాణా చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. విశాఖపట్నం జిల్లా ఆరకులోయ ప్రాంతం నుండి అక్రమంగా గంజాయిని తీసుకొచ్చి రహస్యంగా విక్రయించాలని యత్నిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. టాస్క్ ఫోర్స్ సీఐ హతిరామ్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది, మరిపెడ ఎస్సై టి. కోటేశ్వరరావు మరియు వారి సిబ్బంది కలిసి రాజీవ్ సెంటర్ వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి గంజాయి మరియు ఎన్ఎస్ 160 వైట్ కలర్ బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులుగా మరిపెడకు చెందిన లునవత్ ప్రవీణ్, బోడా కార్తీక్, బాణోత్ శివ, గార్ల మండలానికి చెందిన అభిషేక్ తో పాటు ఒక మైనర్ బాలుడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తదుపరి మరిపెడ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్ గౌడ్ నిందితులను విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుని కోర్టులో హాజరుపరచగా, వారిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ రాజ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని, సమాజంలో ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన మరిపెడ పోలీస్ సిబ్బంది ఉమ మహేశ్వరరావు, సాయి కిరణ్, నరేష్, శ్రీనివాస్, గణేష్, నాగేశ్వరరావు లను సీఐ అభినందించారు.

# మహిళలు ఆకాశమే హద్దుగా ఎదగాలి

## – సర్పంచ్ పబ్బు సతీష్



**వేద న్యూస్, కమలాపూర్:**

సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కమలాపూర్ మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మహిళల కోసం పనిచేసే స్థానిక సంస్థల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుకు సాగేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ప్రతి రంగంలో ప్రతిభ చాటాలని సూచించారు. మహిళల హక్కుల పరిరక్షణకు చట్టాలు, వివిధ సంస్థలు సహకరిస్తున్నాయని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. అనంతరం సర్వోదయ సంస్థ శిక్షణ సమన్వయకర్త ఇందిర మాట్లాడుతూ గ్రామాల్లో లింగ వివక్షను నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణ చట్ట విరుద్ధమని, దీనిపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధి హామీ పథకం అధికారులు, కమ్యూనిటీ నాయకులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు

## – ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వేదం న్యూస్, రేవల్లి:**

కాంగ్రెస్ పార్టీని మండల స్థాయిలో బలోపేతం చేసే చర్యల్లో భాగంగా రేవల్లి, ఏదులగోపాల్పేట్ మండలాల్లో మండల కమిటీల ఎన్నిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శివసేనరెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తప్పకుండా పదవులు లభిస్తాయని తెలిపారు. కొందరికి పార్టీ పదవులు, మరికొందరికి సర్పంచ్, ఎంపీటీసీ, సింగిల్ విండో వంటి స్థానాలు దక్కే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే గ్రామ, బూత్ స్థాయిలో కమిటీలను బలోపేతం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బెండలపాడు ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**వేద న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బెండలపాడు ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, మరుగుదొడ్ల పరిశుభ్రతతో పాటు పాఠశాలలో ఉన్న ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో మొత్తం 120 మంది విద్యార్థులు నమోదు అయినప్పటికీ హాజరు శాతం తక్కువగా ఉండడం కలెక్టర్ గమనించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రాకపోతే చదువుల్లో వెనుకబడే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల 100 శాతం హాజరు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి పిల్లలను పాఠశాలకు క్రమం తప్పకుండా పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందించాలని కలెక్టర్ అంకిత్ సూచించారు. పాఠశాలలో పరిశుభ్రతను కాపాడుతూ విద్యార్థులకు మంచి విద్యా వాతావరణం కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు.

# వెయ్యి రూపాయల కోసం కన్సల్టెన్సీ నిర్వాహకుడి హత్య

**వేద న్యూస్ హైదరాబాద్ :**

కేవలం వెయ్యి రూపాయల కోసం ఓ కన్సల్టెన్సీ సంస్థ నిర్వాహకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపింది. మధురానగర్ ప్రాంతంలో ఉన్న వారాహి మ్యాన్ పవర్ రిక్రూట్‌మెంట్ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. ఏలూరుకు చెందిన జే శశికిరణ్ రెడ్డి (36) ఆ సంస్థను నిర్వహిస్తున్నాడు. నల్గొండకు చెందిన ప్రభుకుమార్ ఉద్యోగం కోసం అతడిని సంప్రదించి రూ.2,500 ఫీజు చెల్లించాడు. తర్వాత పని నచ్చలేదని చెప్పి డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరాడు. శశికిరణ్ రూ.1,500 తిరిగి ఇచ్చినా మిగిలిన రూ.1,000 విషయంలో ఇద్దరి మధ్య వివాదం కొనసాగింది.



# నేడు శాయంపేటలో మెగా వైద్య శిబిరం

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డా. సాయి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ వైద్య శిబిరంలో మహిళల వైద్య నిపుణులు, పిల్లల వైద్యులు, ఎముకల వైద్యులు, కంటి వైద్యులు, సాధారణ వైద్యులు, దంత వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. శాయంపేట మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని డా. సాయి కృష్ణ కోరారు.

# సిటీ కాలేజీ-ఎన్జీసీ మధ్య అవగాహన ఒప్పందం

**వేద న్యూస్, హైదరాబాద్:**



గవర్నమెంట్ సిటీ కాలేజీ మరియు నేషనల్ గైడెన్స్ ఫర్ మెడికల్ కోడర్స్ (ఎన్జీసీ) సంస్థల మధ్య విద్యార్థులకు నైపుణ్య ఆధారిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందాన్ని ప్రొఫెసర్ సిహెచ్. ప్రసాద్ మరియు ఎన్జీసీ ప్రతినిధి పవన్ పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఐదు సంవత్సరాలపాటు అమల్లో ఉండే ఈ ఒప్పందం ద్వారా బయోకెమిస్ట్రీ, అప్లైడ్ న్యూట్రిషన్, బయోటెక్నాలజీ విభాగాల విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌లో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందించనున్నారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణ, మెడికల్ కోడింగ్ రంగాల్లో ఉపాధి అవకాశాలపై మార్గనిర్దేశనం చేయనున్నట్లు ఎన్జీసీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ సుమన యాదగిరి సహా అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఉప్పు సత్యాగ్రహానికి శ్రీకారం చుట్టిన చారిత్రాత్మక రోజు

- బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అహింసా పోరాటానికి నూతన దిశ
- భారత స్వాతంత్ర్య సమరంలో ప్రజలను ఏకం చేసిన ఉద్యమం



**వేద న్యూస్ డెస్క్:**

భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చిరస్మరణీయమైన సంఘటనలలో దండి యాత్రకు ప్రత్యేక స్థానం ఉంది. 1930 మార్చి 12న మహాత్మా గాంధీ బ్రిటిష్ పాలన విధించిన ఉప్పు పన్నుకు వ్యతిరేకంగా ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రారంభిస్తూ దండి యాత్రను ప్రారంభించారు. అహింసా సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకుని ప్రజలను స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ యాత్ర భారతదేశ చరిత్రలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది. ఈ ఉద్యమం ద్వారా సాధారణ ప్రజలు కూడా స్వాతంత్ర్య సమరంలో పాల్గొనేలా ప్రేరణ పొందారు. బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో ఉప్పు తయారీపై పూర్తిగా నియంత్రణలు విధించి, దానిపై పన్ను విధించింది. ఉప్పు ప్రతి వ్యక్తికి అవసరమైన మౌలిక వస్తువు అయినప్పటికీ, దానిపై పన్ను విధించడం అన్యాయమని గాంధీ భావించారు. అందువల్ల ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఉప్పు సత్యాగ్రహాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గుజరాత్ రాష్ట్రంలోని సబర్మతి ఆశ్రమం నుంచి అరేబియా సముద్ర తీరంలోని దండి గ్రామం వరకు సుమారు నాలుగు వందల కిలోమీటర్ల దూరాన్ని నడిచి వెళ్లే యాత్రను ప్రారంభించారు.

దండి యాత్రలో గాంధీతో పాటు ఎన్నో మంది స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొన్నారు. ప్రారంభంలో కొద్దిమందితో ప్రారంభమైన ఈ యాత్ర మార్గమధ్యంలో వేలాది మంది ప్రజలను ఆకర్షించింది. గాంధీ గ్రామాలు, పట్టణాలు దాటి ప్రయాణిస్తూ ప్రజలకు బ్రిటిష్ పాలన విధించిన అన్యాయాలను వివరించారు. ప్రజలను అహింసా మార్గంలో పోరాటానికి సిద్ధం చేశారు. ఈ యాత్ర క్రమంగా దేశవ్యాప్తంగా ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంపొందించింది.

సుమారు ఇరవై నాలుగు రోజుల పాటు సాగిన ఈ యాత్ర చివరకు దండి సముద్ర తీరానికి చేరుకుంది. అక్కడ గాంధీ సముద్ర జలాలను తీసుకుని ఉప్పు తయారు చేసి బ్రిటిష్ ప్రభుత్వం విధించిన చట్టాన్ని ఉల్లంఘించారు. ఈ చర్యతో ఉప్పు సత్యాగ్రహం దేశవ్యాప్తంగా పెద్ద ఉద్యమంగా మారింది. అనేక ప్రాంతాల్లో ప్రజలు కూడా స్వయంగా ఉప్పు తయారు చేసి బ్రిటిష్ చట్టాలను వ్యతిరేకించారు. దీంతో బ్రిటిష్ ప్రభుత్వం ఆందోళనకు గురైంది.

దండి యాత్ర ప్రభావం భారతదేశం అంతటా విస్తరించింది. వేలాది మంది ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం గాంధీతో పాటు అనేక మంది నాయకులను అరెస్టు చేసింది. అయినప్పటికీ ప్రజల్లో స్వాతంత్ర్య ఉద్యమం పట్ల ఉత్సాహం తగ్గలేదు. ఈ యాత్ర భారత స్వాతంత్ర్య పోరాటాన్ని మరింత బలపరిచింది. ప్రపంచవ్యాప్తంగా కూడా భారతదేశంలోని అహింసా ఉద్యమంపై దృష్టి పడేలా చేసింది.

దండి యాత్ర కేవలం ఒక నిరసన కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రజలను ఏకం చేసిన ఒక మహత్తర ఉద్యమంగా నిలిచింది. సాధారణ ప్రజలు కూడా దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములు కావచ్చని ఈ యాత్ర ద్వారా స్పష్టమైంది. గాంధీ చూపిన అహింసా మార్గం ప్రపంచానికి ఒక గొప్ప సందేశాన్ని అందించింది. ప్రతి సంవత్సరం మార్చి 12న దండి యాత్ర వార్షికోత్సవాన్ని స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, సామాజిక సంస్థలు ఈ సందర్భంగా చర్చా దండి యాత్ర భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన సంఘటన. అహింసా సిద్ధాంతంతో ప్రజలను ఏకం చేసి ఒక మహత్తర ఉద్యమాన్ని సృష్టించిన ఈ యాత్ర భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడానికి బలమైన పునాది వేసింది. ఈ చారిత్రాత్మక సంఘటనను ప్రతి సంవత్సరం స్మరించుకోవడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మనం మరవకూడదని చరిత్ర మనకు గుర్తు చేస్తోంది. అప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం ఉప్పు తయారీపై కఠిన నియంత్రణలు విధించి ప్రజలపై అధిక పన్నులు విధించింది. ఉప్పు ప్రతి మనిషికి అవసరమైన సాధారణ వస్తువు అయినప్పటికీ, దానిపై పన్ను విధించడం అన్యాయమని గాంధీ భావించారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు అహింసా మార్గంలో పోరాటం చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమం నుంచి అరేబియా సముద్ర తీరంలోని దండి గ్రామం వరకు సుమారు నాలుగు వందల కిలోమీటర్ల దూరాన్ని నడిచి వెళ్లే యాత్రను ప్రారంభించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073